క్లుప్తంగా

వరిపంటకు 'దోమపోటు'


దోమపోటు సోకిన వరి పొలం

తలుపుల: మండలంలో వరిసాగు చేసిన రైతులు దోమపోటుతో అప్రమత్తంగా ఉండాలని ఏఓ షాదాబ్, వీహెచ్ఏ యాసిన్ సూచించారు. రెండు రోజులుగా బండ్లపల్లి, తూపల్లి హరిజనవాడ, టి.రెడ్డివారిపల్లి తదితర గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరిపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. పలువురు రైతులు సాగు చేసిన వరిపంటకు దోమపోటు సోకిందన్నారు. ముఖ్యంగా దోమపోటు నివారణకు ఆరుతడులు ఇవ్వడం, పొలంలో దారులు తొక్కడం, గట్లపై కలుపు తొలగించడం, రాత్రి వేళల్లో చలి మంటలు వేయడం వలన చిలకలు మంటల్లో పడి చనిపోతాయన్నారు. అక్కడక్కడ జిగురు అట్టలు ఏర్పాటు చేసినా చిలకలు, దోమలు అతుక్కొని చనిపోతాయన్నారు. ఇప్పటికే దోమపోటు పంటకు సోకి వుంటే సోకిన చోట దారులు తొక్కి వేరు చేయాలన్నారు. అవసరం అయిన చోట కార్టాప్ హైడ్రోక్లోరైడ్, కాపర్ ఆక్సిక్లోరైడ్ గుళికలు చల్లాలన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు బుక్కపట్నం కేజీబీవీ విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సౌజన్య, పీఈటీ స్వర్ణ కుమారి ఆదివారం తెలిపారు. ఇటీవల బుక్కపట్నం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 19 విభాగాల్లో జిల్లా స్థాయి షూటింగ్ బాల్ పోటీలు జరిగినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కేజీబీవీ విద్యార్థినులు దీక్షిత, సాయి అఖిల్, రేఖ, మౌనిక, అనిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న కండక్టర్ ఎన్.నరసింహులు

ధర్మవరం అర్బన్: బస్సులో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ప్రయాణికురాలికి సెల్‌ఫోన్ అందించి నిజాయితీ చాటుకున్నారు ఆర్టీసీ కండక్టర్. ధర్మవరం ఆర్టీసీ డిపోలో కండక్టర్ ఎన్.నరసింహులు ఆదివారం గోరంట్ల బస్సు సర్వీసుకు వెళ్లారు. కొత్తచెరువుకు చెందిన ప్రయాణికురాలు గోవిందమ్మ తన సెల్‌ఫోన్‌ను బస్సులో పోగొట్టుకుంది. సెల్‌ఫోన్ తీసుకున్న కండక్టర్ అందులోని ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి, ప్రయాణికురాలు గోవిందమ్మ సెల్‌ఫోన్ పోగొట్టుకున్న విషయాన్ని తెలియజేశారు. అనంతరం కుమారుడు పవన్‌కుమార్‌ను ఆర్టీసీ డిపోకు పిలిపించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశులు, డిపో ఏడీసీలు మాధవ్, టీఎస్ మూర్తి సమక్షంలో సెల్‌ఫోన్‌ను అప్పగించారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్‌ను ఉద్యోగులు అభినందించారు.

80 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: నిరుపేదలకు కంటిచూపును ప్రసాదించడమే లక్ష్యమని యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి రాధాకృష్ణ, క్యాంపు చైర్‌పర్సన్ శీలా నాగేంద్ర తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వంకదారి సుజాతమ్మ జ్ఞాపకార్థం భర్త వంకదారి రామచంద్రగుప్త, కుమార్తె డాక్టర్ నాగమణి జ్ఞాపకార్థం డాక్టర్ బీవీ సుబ్బారావు కుటుంబ సభ్యుల సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలులోని శ్రీచక్ర ఆసుపత్రి వైద్యులు కంటి చూపు తగ్గిన వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి పరీక్షలు చేయగా 40 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. వారందరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ సభ్యులు చాంద్‌బాషా, నాగార్జున, శివప్రసాద్, రమేష్ బాబు, జయరాం, పోలా ప్రభాకర్, ఓవీ ప్రసాద్, నామాల శీన, డాక్టర్ బీవీ సుబ్బారావు, రామచంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిరండి


కదిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి


పుట్టపర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కదిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 7వ తేదీన పుట్టపర్తి విచ్చేస్తున్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై ప్రసంగించారు. జగనన్న ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. లబ్ధిదారులందరూ సీఎం సభకు హాజరయ్యేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభా ప్రాంగణానికి లబ్ధిదారులు నిర్ణయించిన సమయం కన్నా ముందే చేరుకునేలా చూడాలన్నారు. తమ వెంట తీసుకొచ్చిన వారికి తగిన సౌకర్యాలతో పాటు వారికి క్షేమంగా ఇంటికి తీసుకొచ్చే బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. 'జగనన్నే మా నమ్మకం' నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగిపోవాలన్నారు. సమావేశంలో కదిరి ఎంపీపీ అమరనాథరెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

అమడగూరు: పుట్టపర్తిలో జరగబోయే సీఎం సభను జయప్రదం చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పుట్టపర్తికి విచ్చేసి రైతుభరోసా నిధులను విడుదల చేయనున్నారన్నారు. అందరం పెద్ద ఎత్తున తరలివెళ్లి సభను జయప్రదం చేద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, నాయకుడు శివశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: రైతు భరోసా–పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 7న శ్రీసత్యసాయి జిల్లా కేంద్రానికి రానున్నారు. సీఎం సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాయన్నారు. అన్ని వర్గాలకు గతం కంటే మెరుగ్గా సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పథకాల అమలులో ఏపీ రోల్ మోడల్‌గా నిలిచిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లాను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపేందుకు రూ.860 కోట్లతో పరిపాలనా ఉత్తర్వులు విడుదల చేయడం జరిగిందన్నారు. రైతులందరూ ముఖ్యమంత్రి సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుట్టపర్తి అర్బన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుపోషణకు ఆర్థిక సహకారం

గాండ్లపెంట: రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణకు ఆర్థిక సహకారం అందిస్తుందని పశు వైద్యాధికారి కేశవనాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తీసుకునే రుణపై 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. 500 గొర్రెలు, 25 పొట్టేళ్ల పెంపకానికి రూ.50 లక్షలు, 100 గొర్రెలు, 5 పొట్టేళ్ల పెంపకానికి రూ.10 లక్షలు, 200 పెరటి కోళ్ల పెంపకానికి రూ.25 లక్షలు, 110 పందుల పెంపకానికి రూ.30 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన రైతులు http/nlm.udyamimitra.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తనకల్లు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మోహన్‌రెడ్డి (35) అనే వ్యక్తి కదిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. స్థానిక ఈతోడు రోడ్డులో నివాసం ఉంటున్న మోహన్‌రెడ్డి డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది రోజుల క్రితం మోహన్‌రెడ్డికి కాలు విరిగడంతో ఖాళీగా ఉంటున్నాడు. జీవితం మీద విరక్తి చెందిన అతడు రెండు రోజుల క్రితం విషద్రావకం తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కదిరికి తరలించగా.. అక్కడ మృతి చెందాడు.

బాలికా విద్యకు అధిక ప్రాధాన్యత


మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

తనకల్లు: గిరిజన బాలికల విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ ఉన్నారని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని వెల్లడించారు. విద్యార్థులకు చదువే పెద్ద ఆస్తి అని, ప్రభుత్వం అందజేస్తున్న విద్యా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలికలు బాగా చదువుకోవడం ద్వారా సమాజంలో గౌరవం పెరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. భోజన గదులు, తరగతి గదులను పరిశీలించారు. బాలికలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోత్స్న, కన్వీనర్ ప్రిన్సిపాల్ జీవీఆర్ నాయుడు, జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్, నాయకులు సుధాకర్‌నాయక్, రాంప్రసాద్‌నాయక్, భాస్కర్ నాయక్, అంజినాయక్, ఇస్లావత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


ఎడ్ల బండ్లకు రేడియం స్టిక్కర్లు అతికిస్తున్న పోలీసులు


ఈదుల ముష్టూరులో ఓ ఇంట్లో సోదాలు చేస్తున్న ఎస్ఐ, సిబ్బంది

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు నివారణ చర్యలు చేపట్టారు. ఆదివారం బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అతికించారు. మండలంలోని అప్పరాచెరువు, వేల్పుమడుగు తదితర గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. రహదారుల వెంబడి వెళ్లే వాహనాల లైటింగ్స్ వల్ల ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. ప్రమాదాలు నివారించేందుకు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల వెనుక, ముందు ఎర్రటి రేడియం స్టిక్కర్లను సొంత ఖర్చులతో అతికిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాల లైటింగ్స్ స్టిక్కర్ల మీద పడటం వల్ల ఎదురుగా, ముందుర వెళ్తున్న వాహనాలను గుర్తించడానికి వీలు కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వాహనాలకు వెనక ముందు స్టిక్కర్లను వేసుకుంటే ప్రమాదాలు జరగకుండా నివారించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈదుల ముష్టూరులో కార్డెన్ సర్చ్..

మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కార్డెర్ సర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికీ తిరుగుతూ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు. పలు అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు.

మిత్రుడి కుటుంబానికి ఆపన్నహస్తం


రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న స్నేహితులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని వై.కొత్తపల్లికి చెందిన రామాంజినేయులు కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. వివరాలు.. మండల పరిధిలోని వై.కొత్తపల్లిలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో రామాంజినేయులు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు తమ మిత్రుడికి సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. చందాలు వేసి పోగు చేసిన రూ.లక్షను రామాంజినేయులు కుమార్తె పేరుతో బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆదివారం రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని రిటైర్డ్ ఎంఈఓ రమణప్ప, హిందీ అధ్యాపకుడు మహబూబ్‌ఖాన్ చేతులమీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

నేడు సీసీ రోడ్డు ప్రారంభం

ఎన్పీకుంట: మండల పరిధిలోని మేకలచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభిస్తారని ఎంపీపీ ఈటె రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లమీదపల్లి ప్రధాన రహదారి నుంచి గంగెద్దులవారిపల్లి మీదుగా తిమ్మమ్మమర్రిమాను ప్రధాన రహదారి వరకూ సుమారు రూ.35 లక్షల ఎన్ఆర్ఈజీఈఎస్ నిధులతో రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ముగిసిన జ్యోతుల మహోత్సవం


ఆకట్టుకున్న జ్యోతుల ఊరేగింపు


అలంకరణలో దేవాంగ చౌడేశ్వరి

బత్తలపల్లి: మండలంలోని యర్రాయపల్లిలో దేవాంగ చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవం ఆదివారం ముగిసింది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ప్రొద్దుటూరుకు చెందిన దేవాంగ జ్యోతి భక్త బృందం (జ్యోతులు ఆడేవారిని) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జ్యోతులను నెత్తి మీద పెట్టుకుని నాట్యం చేశారు. అదేవిధంగా నల్లమాడ మండలం పాలవాండ్లపల్లికి చెందిన సేవ కుమారులు వీపులపై ఆయుధాలతో పొడుచుకున్న దృశ్యాలు అలరించాయి. మంగళ వాయిద్యాలతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. భక్తుల సౌకర్యార్థం రెండు రోజులుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో ఉత్సవాలు ముగిశాయి. వివిధ గ్రామాల నుంచి భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరించారు.

గుడికట్ల సంబరాలు విజయవంతం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న కురుబ సంఘం నాయకులు

ధర్మవరం అర్బన్: కురుబల ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగే గుడికట్ల సంబరాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని యశోదమ్మ, వకీలు పెద్దయ్య కురుబ కళ్యాణ మండపంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతపురం జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, కళ్యాణ మండపం అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, నాయకులు మాలగుండ్ల రవీంద్ర, మాలగుండ్ల మల్లికార్జున, గిరక నారాయణస్వామి, కోటి వెంకటేష్, బండి ఉజ్జినప్ప, కప్పల బలరాం తదితరులు మాట్లాడారు. ఈనెల 19వ తేదీన అనంతపురం పట్టణంలో జరిగే గుడికట్ల సంబరాలకు కురుబలు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు ఈశ్వరయ్య, చెలిమి పెద్దన్న, మధు, ఆకులేటి వెంకటేష్, మారెప్ప, బండి నారాయణస్వామి, గవ్వల రమేష్, కేశాని సూరి, కవల గోవిందు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు


అలంకరణలో పెద్దమ్మ దేవత

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి దేవమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పాలు, పులమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి భక్తులకు ప్రసాదం అందజేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు 'స్పందన'

తాడిమర్రి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండలంలోని 10 గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆదేశించారు. సచివాలయాల్లో వచ్చిన అర్జీలను మధ్యాహ్నం 2 గంటలకు సంబంధింత అధికారులకు చేరవేయాలని కోరారు.


బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరి దేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.


మెకానిక్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రవికిరణ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బోయవీధికి చెందిన మెకానిక్ రవికిరణ్ ఆదివారం చెరువుకట్ట వద్ద విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు వెంటనే రవికిరణ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు


ధర్మవరంలో ఓటరు వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ రమేష్ రెడ్డి


నల్లచెరువు మండలం పెద్దయల్లంపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్


ముదిగుబ్బ మండలం సానేవారిపల్లిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ రమేష్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 287 పోలింగ్ కేంద్రాలను రెండు రోజులుగా ఏర్పాటు చేశామన్నారు. ధర్మవరం రూరల్‌లో 49, అర్బన్‌లో 104, తాడిమర్రిలో 31, ముదిగుబ్బలో 61, బత్తలపల్లిలో 42 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లులేని వారిని గుర్తించి ఫారం–6లో నమోదు చేస్తున్నామన్నారు. మృతి చెందడం, డబుల్ ఎంట్రీలు ఉన్న వాటిని ఫారం–7లో పొందుపరుస్తున్నట్లు వెల్లడించారు. ఓటర్ కార్డులో తప్పులున్నా, జీరో డోర్‌నెంబర్ ఉన్న వాటిని ఫారం–8లో నమోదు చేయిస్తున్నామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక బీఎల్ఓ, ఏజెంటు ఉంటారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 24 మంది సూపర్‌వైజర్లను కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్ఓలు పారదర్శకంగా తమ విధులను నిర్వర్తించాలని సూచించారు.

నల్లచెరువు: మండల పరిధిలోని సంజీవిపల్లి, పెద్దయల్లంపల్లి, దేవిరెడ్డి పల్లిలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రవికుమార్ ఆదివారం సందర్శించారు. విద్యుత్, ఫర్నీచర్, మంచినీటి వసతి, దివ్యాంగులు, వృద్ధులకు ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించారు.

ఓటరు జాబితా పరిశీలన

ముదిగుబ్బ: మండల పరిధిలోని సానేవారిపల్లిలో ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బీఎల్ఓ ఆధ్వర్యంలో ఓటరు జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీనాథ్ గౌడ్, వెంకటరమణ, కేశవరెడ్డి, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేయించాలని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ బీఎల్ఓలను ఆదేశించారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివాం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండోరోజు మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ఓటరు నమోదు కోసం 35 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఓటరుగా నమోదుకు అవకాశం

నల్లమాడ: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు నిండిన వారు ఎవరైనా ఓటరుగా నమోదు చేయించుకోవచ్చని తహసీల్దార్ దేవేంద్రనాయక్, డిప్యూటీ తహసీల్దార్ (రీ సర్వే) ఎంఎస్ మల్లికార్జున తెలిపారు. ఆదివారం నల్లమాడ, కుటాలపల్లి, సి. బడవాండ్లపల్లిలో ఓటరు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం–6, సవరణలకు ఫారం–8లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారు ఉంటే ముందుగా పంచనామా ద్వారా నోటీసు అందజేసి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకున్న తర్వాత ఓటరు జాబితాలో పేరు తొలగించాలని బీఎల్ఓను ఆదేశించారు.

పోతలయ్య స్వామికి పూజలు

కనగానపల్లి: దాదులూరులో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి బోనాలు సమర్పించారు. పోతలయ్య, చెన్నేకేశవస్వాములను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.